యువ పర్యాటక క్లబ్బులతో పర్యాటకానికి కొత్త రూపు

- ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో యువ టూరిజం క్లబ్ ప్రారంభం
- జిల్లా పర్యాటక శాఖాధికారి నడిమింటి నారాయణ రావు

విశాలాంధ్ర-రణస్థలం : జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా జిల్లాలో పర్యాటక, ప్రాభవాన్ని తీసుకొచ్చేందుకు యువ పర్యటక క్లబ్‌లు దోహదపడతాయని జిల్లా పర్యాటక శాఖాధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. మండలంలోని నడుకుదిటి పాలెంలోని ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం యువక్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో వందకు పైగా ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో కృషి చేస్తున్నామని తెలిపారు. టూరిజం కౌన్సిల్ మెంబర్ డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ మన సంస్కృతి వారసత్వ సంపద పరిరక్షించబడాలంటే పర్యాటక ప్రదేశాల అభివృద్ధి చెందాలన్నారు. పర్యాటక శాఖ, భారత జాతీయ కళలు, సంస్కృతి వారసత్వ సంస్థ, ఇంటాక్ న్యూ ఢిల్లీ తరపున శ్రీకాకుళం చాప్టర్ పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేస్తుందని అన్నారు. యువ క్లబ్బుల నిర్వహణ సిబిఎస్ఈ వారు రూపొందించిన మార్గదర్శకాలను తెలుగులోకి అనువదించి క్లబ్బులకు అందించి శిక్షణ ను ఇస్తామన్నారు. యువత స్వయం సంవృద్ధి వైపు అడుగులు వేయాలని, అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. జిల్లాలో ఏ స్కూల్‌లో లేని విధంగా ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గొప్ప క్రీడా మైదానాలు, అధునాతన తరగతి గదులు, నిష్ణాతులైన బోధనా సిబ్బంది, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా సౌకర్యాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం జిల్లా వాసులకు వరం లాంటిదన్నారు, మన సంస్కృతి-వారసత్వ సంపద పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు అని చెప్పారు. తమ స్కూల్‌లో కూడా విభిన్న భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. శ్రీమహాలక్ష్మి యూత్ క్లబ్ ద్వారా సామాజిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు, యువతను చైతన్యం చేసే బాధ్యతను కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి మాట్లాడుతూ విద్యార్థులకు టూరిజం యువక్లబ్ వల్ల భవిష్యత్‌లో మంచి ప్రయోజనాలు ఉంటాయన్నారు, వివిధ ప్రాంతాల గురించి అక్కడి ప్రాముఖ్యతలు పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత విద్యలో రాణించగలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌వివిఎస్ ప్రసాద రావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆర్యభట్ట గణిత పోటీల్లో దక్షిణ భారతదేశంలో మొదటి 100లోపు ర్యాంకుల్లో నిలిచిన తమ స్కూల్ విద్యార్థులు ఎన్.భావన, వి.భార్గవి, పి.దిశాంత్‌లను ఈ సందర్భంగా అధికారులు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

ఆలస్యంగా వస్తే అనుమతి లేదు

- ఉదయం 8:45 గంటల నుంచి 9.30 వరకు పరీక్ష హాల్లోకి అనుమతి
- ఆ తర్వాత ఎవరినీ అనుమతించరు - పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ అలీఖాన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచి 9.30 వరకు మాత్రమే పరీక్ష హాల్లోకి అనుమతిస్తామని పరీక్షల అసిస్టెంట్ కమీషనర్ అలీఖాన్ తెలిపారు. 9.30 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన ఎవరినీ అనుమతించబోమని. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ ఏపీ.జీవోవీ.ఇన్)లో పరీక్షల టైమ్ టేబుల్‌ను చూడొచ్చన్నారు. అన్ని పరీక్షకు నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి. 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

13న స్పందన కార్యక్రమం రద్దు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో ఈ నెల 13న జరగనున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ రోజు జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆ ప్రకటనలో కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి శిరీష

విశాలాంధ్ర-పలాస : నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి దొరికిన మొదటి అవకాశం ఎమ్మెల్సీ ఎన్నికలని, ఈ ఎన్నికల్లో పట్టభద్రుల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేపాడ చిరంజీవిరావులను పట్టభద్రులు వారి మొదటి ప్రాధాన్యత ఓటును బ్యాలెట్‌లో గల నెంబరు 2లో ఎదురుగా ఒకటి వేసి గెలిపించాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పలాస నియోజకవర్గం ఇన్‌చార్జీ గౌతు శిరీషా అన్నారు. శనివారం పలాస టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నా వైసీపీ గోడ పత్రికలు కనిపిస్తుండడం ఈ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. ఇటువంటి పరిపాలన సాగిస్తున్న ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఈ ఎన్నికలే గుణపాఠం చెబుతుందని, అందరు గ్రహించి ప్రతి ఒక్కరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. నిరుద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి చిరంజీవిరావును గెలిపించడం ద్వారా మన గొంతును చట్టసభల్లో వినిపించే అవకాశం వస్తుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మద్దిపాటి వెంకటరావు మాట్లాడుతూ దౌర్జన్యాలతో పాలన సాగి స్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ ఓటు ద్వారా ప్రశ్నించాలని, ఉన్నత విద్యార్హత కలిగి సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చిరంజీవురావును పట్టభద్రులంతా తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో విఠల్, గురిటి సూర్యనారాయణ, వజ్జ బాబూరావు, లొడగల కామేష్, బద్ద నాగరాజు, సప్ప నవీన్, గాలి క్రిష్ణ, యవ్వారి మోహనరావు, నాబిల్లి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో పర్యటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శ్రీకాకుళం రిమ్స్‌లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ, భవనాలు నిర్మించినా, లోపల డాక్టర్లు, ఇతర సిబ్బంది సరిపడినంతమంది లేరని, ఇది వైద్యాన్ని ప్రజలకు దూరం చేయడమేనని తెలిపారు. ఇతర సిబ్బంది అంతా కాంట్రాక్టు సిబ్బందేనని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రెగ్యులరైజేషన్ హామీ, మిగిలిన హామీల లాగానే అమలు కాలేదని తెలిపారు. ఉత్తరాంధ్రలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల స్థితీ ఇలాగే ఉందని చెప్పారు. ఉద్దానం కిడ్నీ వ్యాధి నివారణా చర్యలు నేటికీ చేపట్టలేదని, రిమ్స్ ను పూర్తి స్థాయి సౌకర్యాలతో, సూపర్ స్పెషాలిటీ వైద్య కళాశాల, ఆసుపత్రికి అభివృద్ధి చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు ప్రాంత అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. తాను ఈ ప్రాంత ప్రజల వాణిగా ఉంటానని, అభివృద్ధికి కృషి చేస్తానని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ఇతర తరగతుల ప్రజలకు అండగా ఉంటానని, తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం పాలవలస పంచాయతీ కుమ్మరిపాడు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీలో భాగంగా సోంపేట జెడ్పీటీసీ తడక యశోద, మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షులు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెట్టే గుడ్లును పరిశీలించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : సిఐ ప్రసాద్

విశాలాంధ్ర-కవిటి: క్రీడలతో మానసిక ఉల్లాసమని ఇచ్ఛాపురం సిఐ ఆర్‌ఎసిహెచ్ ప్రసాద్ అన్నారు. ఈమేరకు శనివారం బైరిపురం గ్రామంలో శ్రీ అఖిలేశ్వరి రాష్ట్రస్థాయి ఆహ్వానిత వాలీబాల్ టోర్నమెంట్ (డే అండ్ నైట్)ను ఇచ్చాపురం సిఐ, ఆర్‌ఎసిహెచ్ ప్రసాద్ చేతులమీదుగా ప్రారంభించారు. శని, ఆదివారాలలో నిర్వహించే ఈ పోటీలు రొటేషన్ పద్ధతిలో క్రీడాకారులు డ్రెస్ కోడ్‌ను పాటించి పోటీలు చేపట్టారు. ఈసందర్భంగా సిఐ,ఆర్‌ఆసిహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక వ్యాయామంతో పాటు సంఘటిత శక్తి పెరుగుతుందన్నారు. యువత సన్మార్గంలో నడిపించేందుకు యువజన సంఘాల కృషి చేయాలని కోరారు. క్రీడల్లో ఆసక్తి పెరిగితే యువత సన్మార్గంలో పయనించి అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవిటి ఎస్ఐ రాము, పిఈటీలు బల్లెడ రమేష్, నేతాజీ పాల్గొన్నారు.

ఫారామిలటరీ సైనికుడు మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళిలో నివాస ముంటున్న ఫారామిలటరీ సైనికుడు రొక్కం లక్ష్మణ్ (40) శనివారం విధినిర్వాహణ లో అస్సాంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే లక్ష్మణ్ ఉద్యోగరిత్యా అస్సాం పారామిలటరీలో సైనికుడుగా పని చేస్తున్నాడు. సంతబొమ్మాళి మండలం ఆకుల సత్తివానిపేట గ్రామ నివాసి అయినప్పటికి తన భార్య పిల్లలను కొటబొమ్మాళిలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. అయితే లక్ష్మణ్ అస్సాంలో విధినిర్వాహనలో ఉండగా అక్కడకు వచ్చిన దుప్పికి మంచినీరు పెట్టుందుకు దుప్పి వద్దకు వెళ్ళగా అది పొడవడంతో వెనుకకు పడిపోయి తలకు తీవ్రగాయాలు కావడంతో అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని స్థానికుల సమాచారం మేరకు చెబుతున్నారు. అయితే మృతుడు లక్ష్మణ్‌కు భార్య క్రిష్ణవేణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నారా లోకేష్ వ్యాఖ్యలు వెనుకకు తీసుకోవాలి : మంచు చంద్రయ్య

విశాలాంధ్ర-పాతపట్నం : చేనేత కార్మికుల పైన సంఘ నాయకులు పైన నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని జిల్లా చేనేత వైసీపీ విభాగం అధ్యక్షుడు మంచు చంద్రయ్య అన్నారు. ఇటీవల టిడిపి నాయకులు నారా లోకేష్ తన పార్టీ నుంచి వెళ్లిపోయిన గంజి చిరంజీవి 45 రోజుల్లో మాయల ఫకీరు మంత్ర దండంతొ చేనేత కార్మికులకు ఏమి చేయలేదని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ మేరకు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ అనుభవ రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న తన తండ్రి చంద్రబాబు చేయలేని, చేయని నేతన్న నేస్తం పథకం ప్రవేశపెట్టి సంవత్సరానికి 24000 రూపాయలు ఇచ్చి మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ఆదుకున్నారని అన్నారు. 75సంవత్సరాల స్వతంత్రం వచ్చిన తరువాత నేత కార్మికులకు ఆదుకున్న మొట్టమొదటి పథకమని గ్రహించి లోకేష్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని పత్రిక ముఖముగా క్షమాపణ చెప్పి ఇకనైనా నోరును అదుపులో పెట్టుకోవాలని కోరారు.

సముద్ర స్నానానికి వెళ్లిన ఫార్మసీ విద్యార్థి మృతి

మరో విద్యార్థిని కాపాడిన మత్స్యకారులు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : స్నానానికి వెళ్లిన స్నేహితులకు చేదు అనుభవం ఎదురైంది. ఒక కళాశాలకు చెందిన విద్యార్థులంతా కలిసి సముద్ర స్నానానికి వెళ్ళగా ఇందులో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరిని స్థానిక మత్స్యకారులు కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా... ఎచ్చెర్లలోనీ ఒక ఫార్మసీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్న 12 మంది విద్యార్థులు శనివారం ఇదే మండలం, డి.మత్స్యలేశం పంచాయతీ రాళ్లపేట తీరం వద్దకు మధ్యాహ్నం రెండున్నర గంటలకు సముద్ర స్నానానికి వెళ్లారు. సముద్ర స్నానానికి వెళ్లిన వారిలో నిడదవోలు దుర్గా సతీష్ చౌదరి, ఆకుల గణేష్, అజయ్ కుమార్, మహేష్ కుమార్, జాన్ బెన్నీ, సాయి గణేష్ అనంత ఆదిత్య, తారకేష్, బాలాజీ, నీలి హ్యేండ్సన్, గౌతమ్ ఉన్నారు. ఇందులో 10 మంది విద్యార్థులు స్నానానికి దిగగా ఇద్దరు విద్యార్థులు ఒడ్డున ఉన్నారు. విద్యార్థులు అంతా కేరింతలు కొట్టుకుంటూ ఆనందంగా గడుపుతున్న సమయంలో అలల తాకిడికి ఇద్దరు విద్యార్థులు గురయ్యారు. ఇందులో స్నానానికి దిగిన నిడదవోలు దుర్గా సతీష్ చౌదరి(20), ఆకులు గణేష్ అలల తాకిడికి లోపలకు కొట్టుకుపోయారు. దీనిని గమనించిన మిగిలిన స్నేహితులు కేకలు వేసుకొని ఒడ్డుకు చేరారు. కాపాడంటూ స్నేహితులంతా కేకలు వేయడంతో ఆ సమయంలో వేటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న మత్స్యకారులు ఆ విద్యార్థుల కేకలు విని అప్రమత్తమయ్యారు. సముద్రంలోకి వెళ్ళిన మత్స్యకారులు ఆకులు గణేష్‌ను రక్షించడంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డాడు. సతీష్ చౌదరిని రక్షించేందుకు మత్స్యకారులు ప్రయత్నించినా ఫలితం లభించలేదు. దీంతో బోట్ల సాయంతో సతీష్‌ని రక్షించేందుకు వలలతో గాలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయిన సతీష్ వాళ్లకు చిక్కాడు. గాయపడిన గణేశుని 108 అంబులెన్స్ పై చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మృతుడు సతీష్ విజయనగరం జిల్లా జీఎం వలస మండలం పరజవాడ గ్రామానికి చెందిన వాడు. కాగా ఈ సంఘటనలో గాయపడిన గణేష్ ఒరిస్సా రాష్ట్రం పర్లాకిమిడి చెందినవాడు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్లీల దృశ్యాల ప్రచారానికి అడ్డుకట్ట వేయాలి

రాష్ట్ర, జిల్లా ఏఐవైఎఫ్ కార్యదర్శులు డిమాండ్

విశాలాంధ్ర-నరసన్నపేట : సోషల్ మీడియా, ఫేస్ బుక్‌లలో అశ్లీల దృశ్యాల ప్రచారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎం.యుగంధర్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి, కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫోన్‌లలో అశ్లీల దృశ్యాలు ప్రచారం కావటంతో యువత చెడు మార్గంలో పయనించేందుకు అస్కారముంటుందని అన్నారు. అలాగే రాష్ట్రంలో మెడికల్ మాఫియా ఆగడాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని, మెడికల్ షాపుల యజమాన్యాలు ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయని విమర్శించారు. మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అధికారుల మామూళ్ళ మత్తులో తూగుతున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బోగస్ మెడికల్ హబ్‌గా మారిందని, ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు, మెడికల్ షాపు యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి, నకిలీ మందులను విక్రయిస్తూ ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తున్నారని అన్నారు. జిల్లాలో కేంద్రంలో గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్, గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, దీనివలన యువత అనారోగ్యం పాలై, వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. పై విషయాలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో వున్న ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీ, మెడికల్ షాపులు, అసుపత్రులుపై పర్యవేక్షణ చేసి, మందుల అమ్మకాలను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎం.యుగంధర్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి, కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు, ఎన్.సాంబశివరాజు, ఎం.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా 'సీతంరాజు సుధాకర్' గెలుపు తథ్యం

విశాలాంధ్ర-నరసన్నపేట : ఈనెల 13వ తేదీన నిర్వహించే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా అభ్యర్థిగా వైసిపి ప్రతిపాదించిన సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యమని నరసన్నపేట ఎమ్మెల్సీ ఎన్నికల పట్టణ ఇంఛార్జీలు, సాసుపల్లి కృష్ణబాబు, సదాశివుని కృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ, నేతాజీవీధి, బైరాగివీధి, స్టేట్‌బ్యాంక్ వీధి పరిసర ప్రాంతాల్లో సుధాకర్ తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించటం ద్వారా తమ సమస్యలు త్వరితగతిన పరిష్కరించుకొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి, నేతింటి రాజేశ్వరరావు, వార్డు మెంబర్లు, బి.లోకనాధశర్మ, మానెం శివుడు, వైసిపి ప్రతినిధులు తంగుడు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా కర్రసాము పోటీల్లో తృతీయస్థానం

విశాలాంధ్ర - జలుమూరు : ఆలిండియా కర్రసాము పోటీల్లో జిల్లా క్రీడాకారుడు తృతీయస్థానం సాధించాడు. తమిళనాడు రాష్ట్రంలోని రాజుపాలెం వేదికగా ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జలుమూరు మండలం యలమంచిలి గ్రామానికి చెందిన చెంచల జగదీశ్వరరావు ప్రతిభ కనబర్చి కాంస్య పతకం దక్కించుకున్నట్లు బలదేవ్ ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ సంఘం అధ్యక్షుడు బలగ లక్ష్మణ్ దేవ్ తెలిపారు.

సీతంరాజు సుభాకర్‌ను గెలిపించాలి : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రుల అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. శనివారం పలాస ప్రగతి భవన్‌లో ఆయనను కలిసిన పట్టభద్రులతో మాట్లా డుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహనరెడ్డి బలపర్చిన సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో గల విద్యాసంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 16వ వార్డులో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీశంకర్, వార్డు ఇన్‌చార్జీ మార్పు యుగంధర్, రవీంద్రనాద్ పండా, తామాడ రమేష్, చిరు, సాహిద్, వాసు, వినోద్, బడివాడ నాగు, కుమార్ అప్పో, మహిళా శక్తి కన్వీనరు వాసవి, నవీనా, స్వప్న, వైకుంఠరావు, సూర్యరావులను పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో సాయిప్రీతమ్ ప్రతిభ

విశాలాంధ్ర - సోంపేట : అనకాపల్లి జిల్లా యలమంచిలిలో జరిగిన రాష్ట్రస్థాయి 40వ సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో సోంపేటకు చెందిన రత్నాల సాయిప్రీతమ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 44 కేజీల విభాగంలో విజయం సాధించడం పట్ల శిక్షకుడు లోకేష్‌తో పాటు తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యా యులు హర్షం వ్యక్తం చేశారు. సాయిప్రీతమ్ సోంపేటలో శారద విద్యానికేతన్‌లో 7వతరగతి చదువుతున్నాడు. గతంలో జిల్లాస్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్న విషయం విధితమే. సాయిప్రీతమ్ తల్లిదండ్రులు రత్నాల చంద్ర శేఖరం, లీలాకుమారి పంచాయతీ కార్యదర్శులు గా పనిచేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

విశాలాంధ్ర-మెళియాపుట్టి : టైరు పేలిపోవడంతో విద్యుత్ స్తంభానికి కారు ఢీకొన్న సంఘటన మెళియాపుట్టి మండలం చాపర గ్రామంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాల్లోకి వెళ్తే మెళియాపుట్టి మండలం చాపర గ్రామంలో శుక్రవారం అర్థరాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో పలాస నుండి వస్తున్న కారు టైర్ పేలిపోవడంతో కారు అదుపుతప్పి రోడ్డుకి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఆ సమయంలో కారులోనున్న బెలూన్లు ఓపెన్ అవ్వడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదని, విద్యుత్ స్తంభానికి కారు ఢీకొనడంతో కారు ముందు భాగమంతా నుజ్జయిందని, అలాగే ఆ సమయంలో విషయం తెలుసుకున్న విద్యుతుశాఖ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ స్తంభానికి ఢీకొన్న కారును ఆ ప్రదేశం నుండి తీసివేయడంతో పాటు విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశారు. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కుంచాల సురేష్ కుమార్‌కు ఢిల్లీ నుంచి ఆహ్వానం



విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్: ప్రపంచ వినియోగదారుల హక్కులు దినోత్సవం పురస్క రించుకొని ఈ నెల 15వ తేదీన ఢిల్లీలో జరగ బోయే వినియోగదారుల హక్కులు సదస్సుకు శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలస గ్రామం నుండి ఆహ్వానం అందినట్లు కుంచాల సురేష్ కుమార్ అలియాస్ దేవేందర్‌నాయుడు తెలియజేశారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ఎంతోమంది గొప్ప మేధావులు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్న ఈ ప్రపంచ వినియోగదారుల హక్కుల సదస్సుకు ఆహ్వానం అందడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంద న్నారు. వినియోగదారుల హక్కుల రక్షణకై తనకి ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని సురేష్ కుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి న్యాయవిద్యతో పాటు ఎన్నో ఉన్నతమైన డిగ్రీలు సంపాదించి ఒక ఉన్నత విద్యావంతుడుగా తన గ్రామానికి మంచి గుర్తింపు తెచ్చిన సురేష్ కుమార్ ఇటీవల రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్‌గా నియామకం పొందారు.

పంచాయతీలలో కోట బ్రదర్స్ ప్రచారం

విశాలాంధ్ర-ఆమదాలవలస : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆముదాలవలస నియోజవర్గం ఆముదా లవలస మండలంలో గల గ్రామ పంచాయతీలు నిమ్మతొర్లువాడ, కొరపాం, జి.కె.వలస, నెలిపర్తి పంచాయతీలలో శనివారం ఆముదాలవలస నియోజకవర్గం వైయస్సార్ సిపి సీనియర్ నాయకులు కోట గోవిందరావు పట్టభద్రుల ఓటర్స్‌ని కలిసి, వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డి బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతం రాజు సుధాకర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పైన తెలిపిన గ్రామ పంచాయతీలలో పట్టభద్రుల ఓటర్స్‌కు అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఓటర్ పేరు, పోలింగ్ కేంద్రం అడ్రస్ పోలింగ్ బూత్ నెంబర్లు వివరాలతో కూడిన కరపత్రాలను కూడా ఓటర్లకు అందజేశారు, ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా సుధాకర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ఆన్లైన్ పరీక్షలలో రాణించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.జానకి రామయ్య మాట్లాడుతూ ఇప్పుడు ఉయ్ ఆర్ సైంటిస్ట్ అనే అంశంపై, ఆంగ్లంలో కుసుమ, నవ్య, లావణ్య, శివాని, పి.మనోజ్‌కుమార్, సమజ్ఞ, భువనకృతి, వి.మనోజ్ కుమార్, పి.మనోజ్ కుమార్‌లకు ఉత్తమ విద్యార్థులుగా ప్రశంసాపత్రాలు పొందటం హర్షదాయకమన్నారు. పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయులు తూట భాస్కరరావును కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంతం, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మి, భవాని, సూర్యకాంతం, సునీత, పార్వతి, అరుణశ్రీ, ఉమ, చిన్నారావు, రాము, అప్పలరాజు, మార్కండేయులు, కృష్ణవేణి, సిఆర్‌పి గిరి, రోజా, దయాసాగర్, శివలు, విద్యార్థులకు అభినందించారు.

కొండ కాలువ స్థలం @3 కోట్లు?

కబ్జా చేసేందుకు చోటా నాయకుల యత్నం

విశాలాంధ్ర-పలాస : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో భూ ఆక్రమణలు రోజురోజుకు అధికమవుతున్నా స్థానిక రెవిన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూదికొండ ప్రాంతంలో స్థలాలు పూర్తి అన్యాక్రాంతం కాగా వాటిని కబ్జా చేసి అమ్మకాలు చేసిన వ్యక్తులు విశాఖలో విల్లాలు కొనుగోలు చేసారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అదే కోవలో పలాస ఆర్టీసి డిపో సమీపంలో గల 3 కోట్ల రూపాయలు విలువ గల ప్రభుత్వ వరద కాలువ స్థలం కబ్జా చేసేందుకు చోటా నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇదే స్థలంపై తిమడాన క్రిష్ణ, ఇప్పిలి సింహాచలంలు ఒకరి తరువాత ఒకరు పట్టాలు చేసుకొని ఆ స్థలంను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. ఇరువురు ఆ స్థలం తమదేనని కోర్టును కూడా ఆశ్రయించారు. కాలగమనంలో వారిద్దరు మృతి చెందగా వారి వారసుల మధ్య ఈ స్థలంపై వివాదాలు కొనసాగుతునే ఉన్నాయి. 1980వ దశకంలో అన్ని పార్టీలకు చెందిన కార్యకర్త ఇప్పిలి సింహాచలంకు సూదికొండ వద్ద 2 ఎకరాలు డి.ఫారం జీడి తోట ఉండేది. రెవిన్యూ అధికారులు సూదికొండ వద్ద పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సింహాచలం జీడి తోటను స్వాధీనం చేసుకొని దాని స్థానంలో మార్కెట్ విలువ కేవలం లక్ష 50వేల రూపాయలు చెల్లిస్తే ఆర్టీసి డిపో వద్ద ప్రస్తుత వివాదంలో ఉన్న కాలువ స్థలంను సింహాచలంనకు పట్టా ఇచ్చేందుకు అప్పటి సబ్ కలెక్టర్ ముదావత్ ఎం.నాయిక్ ఒప్పందం కుదుర్చుకున్న ఆ వ్యవహారం కొనసాగలేదు. ఈ లోపల సబ్ కలెక్టర్‌తో పాటు అప్పటి తహాశీల్దార్ కూడా బదిలీ కావడంతో కొత్త తహాశీల్దార్ వచ్చిన తరువాత సింహాచలంకు పట్టా ఇచ్చినట్లు కుటుంబీకులు తెలుపుతున్నారు. ఈ తరుణంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడడంతో అప్పట్లో యువజన కాంగ్రెస్ నాయకుడుగా వ్యవహరించిన తిమడాన క్రిష్ణ కూడా అదే స్థలంపై పట్టా పొందినట్లు సమాచారం. ఇరువురు పేరున కూడా రెవిన్యూ రికార్డుల్లో పట్టాలు ఇచ్చినట్లు నమోదు కాలేదని విశ్వసనీయవర్గాల బోగట్టా. ఈ నేపథ్యంలో పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో గల ప్రభుత్వ స్థలాలు, కొండ పోరంబోకు భూములు, కాలువలు ఆక్రమణలు జరిగిపోగా వివాద స్పదంగా డిపో ఎదురుగా స్థలం బంగారు కొండలా వారి కంట పడింది. దీనిని ఎలాగైనా వశం చేసుకొని 3 కోట్ల రూపాయలకు అమ్మేందుకు చోటా నాయకులు ప్రణాళికలు వేశారు. ఈ నేపథ్యంలో పలాసకు చెందిన వైశ్య కులానికి చెందిన వ్యక్తికి కూడా ఈ స్థలంపై హక్కులున్నాయని ప్రచారం జరుగుతోంది. స్థలం అమ్మకాలకు పలాసకు చెందిన కొంతమంది వైశ్యులు అడ్డుగా వస్తున్నారని భావించి శుక్రవారం ఏఎంసి చైర్మన్ పి.వి. సతీష్‌ను ఇప్పిలి సింహాచలం కుమారుడు భౌతిక దాడులు చేసేందుకు ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆయన పోలీసులను కూడా ఆశ్రయించినట్లు బోగట్టా. అయితే సింహాచలం కుమారుడు ఆ స్థలంను నర్సిపురంనకు చెందిన పైల అప్పారావుకు అగ్రిమెంట్ ఇచ్చారని, ఆయన ద్వారా ఈ స్థలంను అమ్మకాలు జరిపేందుకు చోటా నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు బోగట్టా. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి విలువైన కాలువ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మైనర్ చేతిలో వాహనం... ప్రమాదకర ఆయుధం

- ద్విచక్ర వాహనంపై ముగ్గురు, నలుగురేసి చక్కర్లు
- ఎదుటి వారి ప్రాణాలకూ పొంచివున్న ముప్పు
- అడపా దడప పోలీసుల కౌన్సిలింగ్
- నూతన చట్టాలతో పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా ఇబ్బందులే

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: 18 ఏళ్లు నిండని వారు రహదారులపై ద్విచక్ర వాహనాలతో పరుగులు పెడుతున్నారు. సరైన వయసు.. అవగాహన.. శిక్షణ లేని వ్యక్తి చేతిలో ఉన్న వాహనం ఒక ప్రమాదకర ఆయుధం వంటిదే. అది వారితోపాటు ఇతరులకు హాని కల్గించక మానదు. అతివేగంతో ప్రమాదాల పాలై ప్రాణాల పోగొట్టుకుంటున్నారు. మరికొన్ని సందర్భాల్లో ఇతరుల ప్రాణాలు తీస్తున్నారు. సరదా, స్నేహితుల దగ్గర మెప్పు పొందడానికి విన్యాసాలు చేస్తూ కన్నవారికి కడుపు కోతమిగులుస్తున్నారు. ఇంట్లో చెప్పకుండా స్నేహితుల వాహనాలతో షికార్లు చేసేవారు కొందరైతే అమ్మ నాన్న ఎవరో ఒకరు గారాబంతో బండి ఇవ్వడంతో బయటకు వస్తు న్నారు మరికొందరు. వీరి సరదా వారితోపాటు ఎందరో కుటుంబాల్లో విషాదం నింపుతోంది. ఈ తరహా ప్రమాదాలు నిత్యం ఎక్కడో ఒక చోట మనం వినవలసిన పరిస్థితి. ఇందుకు ముఖ్యంగా తల్లిదండ్రులు అధికారులకు సహకరిస్తేతప్ప దీనికి అడ్డుకట్ట పడదు. ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాలపై మైనర్లు జోరుగా పరుగులు తీస్తు న్నారు. 18 ఏళ్లలోపువారు వాహనాలపై మోజుతో, స్నేహితులతో కలిసి సరదా కోసమో, ఇతరుల మెప్పు కోసమో బండి కనిపిస్తే చాలు ఉరకలేస్తూ.. సవారీ చేస్తున్నారు. దీనివల్ల ప్రమాదాల బారినపడి తమ ప్రాణాలను కోల్పోవడంతోపాటు ఇతరుల ప్రాణాలనూ చిక్కుల్లో పడేస్తున్నారు. కన్న వారి కలలను కలగా మిగిల్చి కానరాని లోకాలకు వెళ్లిపోతున్నారు. పెద్దలు కూడా వాహనాలను ఇచ్చే విషయంలో తమ బిడ్డలకు నచ్చచెప్పలేక పోతున్నారు. భరించలేని కష్టం వచ్చాక.. దేవుడిని నిందిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటు పద్దెనిమిది ఏళ్ల కూడా నిండని పిల్లలు, విద్యార్థులు ప్రమాదాల కారణం అవడం మృతి చెందడం, గాయాల పాలవడం ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మైనర్లు వాహనాలు నడిపినప్పుడు జరిగిన ప్రమాదాలకు బీమా సైతం వర్తించని పరిస్థితి. ఇంట్లో బండి ఉంది. గారాబంగా పెంచిన పిల్లోడు సరదా పడుతున్నాడు. మా బండి మా పిల్లాడు నడిపితే తప్పేంటి అని ప్రశ్నిస్తే కుదరదు. 18 ఏళ్లు నిండని వారు వాహనం నడిపితే అపరాధ రుసుముతోపాటు జైలు శిక్షకూడా వెతుకుతారు. నూతన చట్టాలతో పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా ఇబ్బందులు పడాల్సి ఉంది. ఇటీవల కళాశాల విద్యార్థులు ద్విచక్ర వాహనాలపైనే కళాశాలలకు వెళ తున్నారు. వీరు ఒక్కో ద్విచక్ర వాహనంపై ఇద్దరు, ముగ్గురు, నలుగురు కూడా ప్రయాణం చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది పోలీసులు తనిఖీలప్పుడు తప్పించుకునే ప్రయత్నంతోపాటు ఇతరులను ఆకట్టుకోవడానికి వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా వాహనాలు నడిపే మైనర్లను గుర్తించి.. వారితోపాటు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం వంటివి చేయాలని పలువురు

'వేపాడ'ను గెలిపించండి

విశాలాంధ్ర-మందస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పలాస నియోజకవర్గం ఇన్‌చార్జీ గౌతు శిరీషా అన్నారు. శనివారం మండలంలో మందస, పొత్తంగి, కృష్ణాపురం, సొండిపూడి, వంశీ టాలెంట్ హైస్కూల్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దిన మేధావి వర్గానికి చెందిన చిరంజీవిరావును పెద్దల సభకు పంపించడం ద్వారా ఉపాధ్యాయుల, విద్యార్థుల హక్కుల గురించి విషయం తెలిసిన వ్యక్తిగా న్యాయం చేకూర్చుతారని అన్నారు. కార్యక్రమంలో జి.టి.నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో : తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీలో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార కమిటి కన్వీనర్ బోయిన గోవిందరాజులు కోరారు. శనివారం మేజరుపంచాయతీ పరిదిలోగల ఎస్సీ కాలనీ, హడ్కోకాలని, విద్యుత్‌నగర్, రెడ్డికవీధి, పెద్ద, చిన్న పొందరవీధులలో పట్టభద్రుల ఇళ్ళకు వెళ్ళి ఓటు వినియోగించుకోవాల్సిన విధానం పట్ల అవగాహన కల్పించారు. అలాగే కస్తురిపాడు, విశ్వనాధపురం గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి 1వ ప్రాధాన్యత ఓటును టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీమండల పట్టణ అద్యక్షుడు కోరాడ గోవిందరావు, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ, కోరాడ గోవిందరావు, బోయిన రుత్విక్, తంగుడు సునీల్, కోరాడ అచ్చుతరావు, కొండలరావు, వేణు, ఆను, తదితరులు ఉన్నారు.

మీ గొంతు నా గొంతుగా వినిపిస్తా...

- ఒక్క అవకాశం ఇవ్వండి....
-స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : స్థానిక సంస్థల్లో ఉన్న అనేక సమస్యలపై మీ గొంతు నా గొంతుగా వినిపిస్తా అని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఆనేపు రామకృష్ణ అన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ వేడుకున్నారు. వరి ప్రలోభాలకు లొంగొద్దు, ఎవరికీ భయపడొద్దు ఆయన పిలుపునిచ్చారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో గల స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఆనేపు రామకృష్ణ మాట్లాడారు. అధికార పార్టీ వైకాపా స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తుంద ని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాచోట్ల వైకాపా స్థానిక సంస్థల ప్రతినిధులు అజ్ఞాతంలోకి వెళ్లారని, వారి తరుపున వారి ఇంటి సభ్యులతో ఓటు వేయిం చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమ ర్శించారు. ఓటు వేసేటప్పుదు సీసీ కెమెరాల సమక్షంలో జరుగు తుందని వారిని భయపెడుతూ అధికార పార్టీ నేతలు కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారని పేర్కొ న్నారు. ఈ విషయంలో స్థానిక సంస్థల ప్రతినిధులు ఎవరు భయపడ వలసిన అవసరం లేదన్నారు. మీరు వేసే ఓటు అత్యంత రహస్యంగా ఉంటుందని, ఎవరికీ వేసారన్నది స్పష్టత ఉండదని, దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలని ఆయన చెప్పారు. స్థానిక సంస్థలలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని రామకృష్ణ స్పష్టం చేశారు. టికెట్ ఖరారు చేసే విషయంలో కూడా తమ జాతిలో ఉన్న అనేకమంది రాజకీయ నేతలతో ఎటువంటి చర్చలు జరపకుండా ప్రకటించడం తూర్పు కాపులను అణిచివేయడమేనని పేర్కొన్నారు. తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిసిని చంద్ర మోహన్ మాట్లాడుతూ జాతి ఆత్మగౌరవం నినాదంతో పోటీలో ఉన్న ఆనెపు రామకృష్ణకు ఓటు వేసి సహకరించాలని కోరారు. రాజకీయంగా తూర్పు కాపులను అణచివేయడానికి కుట్ర జరుగుతోందని ఆయన తెలిపారు. ఆ కుట్రను తిప్పికొట్టేందుకే ఎమ్మెల్సీ బరిలో తమ జాతి బిడ్డ అయిన ఆనెపు రామకృష్ణను నిలబెట్టడం జరిగిందన్నారు. ప్రజా ప్రతినిధులంతా ప్రజాస్వామ్య బద్ధంగా సీక్రెట్ ఓటును వినియోగించుకొని మీ యొక్క సమస్యలపై పోరాడే సత్తా ఉన్న రామకృష్ణ కు వేసి గెలిపించాలని పిసిని కోరారు. రాజకీయ పార్టీల నాయకులు చెబుతున్న కవ్వింపు మాటలను నమ్మవద్దని, మిమ్మల్ని భ్రమకు గురిచేసి మరో మారు నమ్మిం చేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా తూర్పు కాపుల సత్తా చూపించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చంద్ర మోహన్ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఏఐటీకేఎస్ఎస్ వర్కింగ్ కో కన్వీనర్ కద్దాల శ్యామ్ సుందర్‌రావు, రాష్ట్ర కోశాధికారి లోలుగు అప్పల నాయుడు, ఏబీబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి బలరాం, తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు పిరియా మాధవి, జిల్లా నేతలు మత్స బుచ్చిబాబు, దాసరి వెంక నాయుడు, యువజన విభాగపు సహాధ్యక్షులు సేపాన శీనుబాబు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధారణకు భరోసా ఇచ్చిన లోళ్ల రాజేష్

జగన్నాథ ఆలయాన్ని సందర్శించిన జనసేన నేత

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రంలోని స్థానిక బెహరవీదిలో వెలసిన శ్రీ జగన్నాధఆలయం ప్రస్తుతం శిధిలావస్థ దశకు చేరుకుంది. ఈ ఆలయ అభివృద్ధికి గతంలో కొంతమేర నిధులు మంజూరు జరిగినప్పటికీ పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. ఒకప్పుడు నిత్యం పూజలు అందుకుని భక్తులు పాలిట కొంగు బంగారంగా నిలచిన తమ ప్రాంత జగన్నాధుని ఆలయం ప్రస్తుతం ఈ దుస్థితిని ఎదుర్కోవడం చూసి స్థానికులు చలించిపోయారు. అందుబాటులో ఉన్న ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపధ్యంలో ఇచ్చాపురం నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ళ రాజేష్‌ను కలసుకుని పరిస్థితిని వివరించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శనివారం లోళ్ళ రాజేష్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గతంలో ఆలయ వైభవాన్ని, ప్రస్తుతం ఉన్న స్థితిని అక్కడివారు లోళ్ళ రాజేష్‌కు వివరించారు. స్థానికుల వినతిపై సానుకూలంగా స్పందించిన లోళ్ళ రాజేష్ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం పూర్తి స్థాయిలో అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ జీర్ణోద్ధారణకు అవసరమైన ప్రణాళికతో తనను సంప్రదిస్తే తన సహకారాన్ని అందిస్తానని ఆలయ కమిటీ సభ్యులకు భరోసా ఇచ్చారు. దీనిపై ఆనందం వ్యక్తం చేసిన అక్కడి వారు త్వరలో పూర్తి స్థాయి వివరాలతో మళ్ళీ కలుస్తామని లోళ్ళ రాజేష్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బెహరా వీధి స్థానికులు, ఇచ్చాపురం నియోజకవర్గ జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వర రావు అధ్యక్షతన శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 2022-23 విద్యాసంవత్సరపు పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ తరగతి ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తూ విద్యార్థుల ఉన్నతి కోసం కృషి చేస్తున్న విషయం వివరించారు. తల్లిదండ్రుల యొక్క పాత్రను ఇంటివద్ద తీసుకోవలసిన విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి ఎంసి చైర్మన్ మొగిలిపూరి కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉదారం ఆయన స్వభావం

- మొర్రి దంపతులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-జలుమూరు : ప్రతి ఒక్కరికి ఎ భగవంతుడు అష్టైశ్వర్యాలు ఇస్తాడు కానీ అందులో కొందరు భగవంతుడు సేవ కోసం ముందుకొస్తారని చల్లవానిపేట సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఆనెం యోగేశ్వరరావు అన్నారు. మొర్రి దంపతులు ఉదారంగా పది మందికి పనికొచ్చే కార్యక్రమం చేపట్టడం ఎంతో ఆనందాయకమని అన్నారు. మొర్రి మురళి మహేశ్వ రరావు, నూకరత్నం దంపతులు చల్లవానిపేట భ్రమ రాంబిక మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో తాండూరి పలకలతో ప్రాంగణం ఫ్లోరింగ్ చేయుటకు రూ. తొమ్మిది లక్షలు వితరణగా అందజేశారు. వీరి దాతృత్వానికి మెచ్చుకొని గ్రామస్థులు వీరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పంచి రెడ్డి రామచంద్రరావు, ఎంపీటీసీ ప్రతినిధి పొన్నాడ విజయ, పంచిరెడ్డి లలితకుమారి, త్రినాధరావు, పలువురు విశ్రాంతి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొ న్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

విస్తృతంగా చివరిరోజు ప్రచారం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలోని అతి పెద్ద పంచాయతీ పురుషోత్తపోరం. ఎమ్మెల్సీ ఎన్నికలు చివరి రోజు కావటంతో టీడీపీ శ్రేణులు పురుషోత్తపురంలో టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిని ఒకటవ ప్రాధాన్యత వోట్ వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామంలో విస్తృత ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాలా సూర్యనారాయణ, మండల అధ్యక్షులు కిల్లి సిద్దార్థ, పల్లి సురేష్, కొర్ను సూర్యనారాయణ, కూటికుప్పల కోటేశ్వర రావు, ధవళ సింహాచలం, గురువు తిరుముల రావు, తడేల రమణ, మరియు ఇతర నాయకులు పాల్గున్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో జేసీ సమావేశం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో ఈనెల 13వ తేదీన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటింగ్ విధానంపై ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు తమ వంతు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. శనివారం జాయింట్ కలెక్టర్ చాంబర్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. అలాగే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలీస్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి తరలింపు, భద్రత మొదలైన అంశాలపై చేపట్టిన చర్యలను పార్టీల ప్రతినిధులకు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపి ప్రతినిధి, స్వతంత్ర అభ్యర్థి అనిపు రామకృష్ణ, కలెక్టరెట్ పరిపాలనధికారి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

డొంక పోలయ్య మృతి తీరనిలోటు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : మండలంలోని చిలకపాలెం గ్రామ మాజీ సర్పంచ్ డొంక పోలయ్య శుక్రవారం కన్ను మూశారు. పోలయ్య ఆ గ్రామ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని, నాగవంశం సంక్షేమ సంఘం అధ్యక్షులు మొకర వెంకట మల్లేశ్వరరావు తెలియజేశారు. శనివారం స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో జరిగిన సంతాప కార్యక్రమంలో మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీ ఏదైనా పోలయ్య చిలకపాలెం గ్రామ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొని నాలుగు పర్యాయాలు గ్రామ సర్పంచ్ బాధ్యతలను నిర్వర్తించారన్నారు. పోలయ్య తండ్రి రామప్పదు రెండుసార్లు, భార్య ఆదిలక్ష్మి రెండుసార్లు సర్పంచ్‌గా గెలిపించి నియోజకవర్గ స్థాయిలో ఆ సామాజిక వర్గంలో మంచినేతగా ఎదిగారని, చిలకపాలెం గ్రామానికీ మౌలిక సదుపాయాల కల్పనలో కృషి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. పోలయ్యకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. ప్రస్తుతం ఆయన సతీమణి ఆదిలక్ష్మి సర్పంచ్‌గా ఉన్నారు. పెద్దకుమారుదు వెంకటరమణ వైకాపా రాజకీయాలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేదని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించండి

ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ను గెలిపించాలని కోరుతూ స్థానిక శాసనసభ్యురాలు రెడ్డి శాంతి ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాడు మెళియాపుట్టి మండలంలో గల మెళియాపుట్టి, పద్మ తదితర పంచాయితీల్లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రచారంను నిర్వహించారు. ఈనేపథ్యంలో ఆమె పలువురు ఓటర్లను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతితో పాటు జెడ్పీటీసీ సభ్యులు గూడ ఎండయ్య, ఎంపీపీ ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, కోసమాల పిఎసిఎస్ అధ్యక్షులు బాలరాజు, గణపతి ప్రధాన్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

శర్వాణిలో "ప్రాజెక్టు డే"

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: స్థానిక అరసవల్లి, అంధవరపు సూరిబాబుగారి ఆధ్వర్యంలో 'శర్వాణి విద్యాలయం'లో ప్రముఖ విద్యావేత్త విశ్రాంత విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు చే అత్యంత ఘనంగా ప్రాజెక్టు డే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆంజనేయులు, హెడ్ మ్రైస్ డా.కె.రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు వివిధ శాస్త్రాలకు - వివిధ భాషలకు చెందిన ప్రాజెక్టులను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి సృజనాత్మకత, కమ్యూనికేషన్ స్కిల్స్ అద్భుతంగా ఉన్నాయని, తెలుగు, ఇంగ్లీషు, హిందీలలో భాషాపటిమ గొప్పగా యున్నదని కొనియాడారు. సంస్థ అధినేత అంధవరపు సూరి బాబు మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖ వికాసాన్ని కాంక్షించి ప్రోజెక్ట్ డే, స్పోర్ట్స్ డే, ఏన్యువల్ డే, ఫీల్డ్ ట్రిప్స్, మెరిట్ క్యాంప్స్, ఎక్స్కర్షన్స్ వంటి ఎన్నో కార్యక్రమాలతోపాటు స్ఫూర్తి కలిగించే వ్యక్తులచే పాఠశాల సందర్శన వంటి యాక్టివిటీస్ విద్యార్థులలో ప్రేరణ, విలువలు కలిగించే విధంగా అటువంటి కార్యక్ర మాలను తీర్చిదిద్దడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమం లో డా. కె. రేఖ మాట్లాడుతూ ఇటువంటి విశిష్ట కార్యక్ర మాల ద్వారా విద్యార్థికి సర్వతో ముఖవికాసాన్ని కలిగించడంతో పాటు డ్యాన్స్, యోగా, కరాటే, మ్యూజిక్లలకు ప్రత్యేక నిపుణులచే బోధించ డం శర్వాణి ప్రత్యేకతని తెలియజేశారు. ఈ ప్రాజెక్టు డే ఉత్సవానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు నిర్వహించే ప్రాజెక్టులు చాలా బాగున్నాయని ప్రశంసించారు.

వికటించిన వ్యాక్సిన్ 15 గొర్రెలు మృతి

- మరో 35 గొర్రెలు అస్వస్థత...
- పశు వైద్య అధికారులు నిర్లక్ష్యం
- లబోదిబోమంటున్న గొర్రెల రైతు అప్పన్న

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం పాలతలగాం గ్రామానికి చెందిన కర్రి అప్పన్న అనే గొర్రె రైతుకు చెందిన గొర్రెలకు పశు వైద్య శాఖ సిబ్బంది ఇచ్చిన వ్యాక్సిన్ వికటించడంతో, 15 గుర్రాలు మృతి చెందగా, మరో 35 గొర్రెలు అస్వస్థత గురయ్యాయి. దీంతో గొర్రెల రైతు లబోదిబోమంటూ రోధిస్తున్నారు. తమ గొర్రెలు వ్యాధి బారిన పడ్డాయని, పశు వైద్య శాఖ సచివాలయ అసిస్టెంట్ పశు వైద్య శాఖ అసిస్టెంట్ స్రవంతి కి తెలియజేయడంతో, వ్యాక్సిన్ ఇచ్చారని బాధితులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం గొర్రెలకు ఒంటిపై పొక్కులు వచ్చాయని సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ స్రవంతికి తెలియజేయగా, షీప్ ఫాక్స్ వ్యాక్సినేషన్ బాటిల్ ఇచ్చారని ఏడాది క్రితం వచ్చిన వ్యాక్సినేషన్ గొర్రెలకు వేయడం వల్లే మృత్యువాత పడ్డాయని స్థానిక గొర్రెల రైతులు అంటున్నారు. ఈ విషయమై మండల పశు వైద్య శాఖ అధికారి అప్పలసూరిని వివరణ అడగ్గా, ప్రభుత్వం నుంచి వచ్చిన వ్యాక్సినేషన్ సరఫరా జరిగిందని, దీనిపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వివరణ ఇచ్చారు. అలాగే ఇప్పటివరకు గొర్రెలు, పశువుల రైతులకు ఎటువంటి వ్యాధులు రాకుండా, పి.పి.ఆర్ ఇంజక్షన్లు వ్యాక్సినేషన్లు ఇస్తూనే ఉన్నామని తెలిపారు. తనకు గొర్రెలు పెంచి అమ్ముకోవడమే జీవనాధారం అని, గొర్రెలు మృతి చెందడంతో ఎలా జీవనం సాగుతుందని లబోదిబోమంటూ రోదిస్తున్నారు. 15 గొర్రెల ముత్యం మృతి చెందడం వలన లక్షలాది రూపాయలు నష్టపోయినని ప్రభుత్వం తనను ఆదుకోవాలని, బాధితులు కర్రీ అప్పన్న ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పదోన్నతి ఉపాధ్యాయుల సమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

విశాలాంధ్ర-ఆమదాలవలస: జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం త్రికరణ శుద్ధిగా పనిచేస్తుందని అందులో భాగంగానే కిలోమీటర్ లోపు ఉన్నత పాఠశాలకు ప్రాథమిక తరగ తులైన మూడు నాలుగు ఐదు విలీనం చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి ప్రాథమిక తరగతి నుండే విషయ బోధన అవసరమని బలంగా నమ్ముతున్నారని అందుకు అవసరమైన సబ్జెక్టు టీచర్లను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని అనుకున్నప్పటికీ ఉపాధ్యాయ పోస్టులు పాఠ శాలల హేతుబద్ధీకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పలువురు ఉపాధ్యాయులు న్యాయస్థానం ద్వారా అభ్యంతరాలు తెలియజేయడం వలన ఆ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. ఆ నేపథ్యంలో అర్హులైన సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లకు తాత్కాలికంగా రూ. 2,500లు గౌరవ వేతనంతో విషయం నిపుణులుగా నియమించడం జరిగింద ని తెలిపారు. వారికి సమాన పనికి సమాన వేతనం అనే మౌలిక కార్మిక న్యాయ సూత్రాల ఆధారంగా వారికి ఎటువంటి ఆర్థిక నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చూస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే పదోన్నతి పోస్టులు క్లియర్ మరియు ఎగ్జిస్టింగ్ ఖాళీల్లోనే నియమించడం జరిగిందని, వారికి రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతి పోస్టులో వేతన స్థిరీకరణ చేసే విధంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్ టి యు) నివేదించిన విజ్ఞప్తిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం హామీ ఇచ్చారు. పదోన్నతి ఉపాధ్యాయులు సమ స్యలను పరిష్కరించాలని సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారానికి చొరవ చూపి అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ డైట్ లెక్చరర్లు పదోన్నతులకు మార్గం సుగమం చేయాలని ఎస్టియు చేసిన విజ్ఞప్తికి స్పీకర్ సానుకూలంగా స్పందించారు. అంతేకాకుండా ఉత్తరాంధ్ర క్యాపిటల్ టౌన్ విశాఖపట్నం లక్ష్యసాధన దిశగా రేపు జరగ బోతున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల మండలి ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా ఉత్తరాంధ్ర నిరుద్యోగ పట్టభద్రుల వలస కూలీల సాధారణ, సామాన్య ప్రజానీకం ఆకాంక్షలు ప్రతిబింబించే విధంగా ఫలితం ఉండాలని ఉద్యోగులు ఉపాధ్యాయులు పట్టభద్రులు ముఖ్యమంత్రి ఆలోచనలకు నైతిక మద్దతు ప్రకటించాలని కోరారు. పట్టభద్రుల ఎన్నికల ఫలితం ప్రతిబింబించే విధంగా మద్దతు ఇవ్వాలని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలను సభాపతి కోరారు సభాపతి ని కలిసిన వారిలో ఎస్ టి యు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ప్రభాకరరావు జిల్లా నాయకులు ఎస్‌వి రమణమూర్తి బగాన రమణమూర్తి కోన కృష్ణారావు గురువుపల్లి భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- మేజరు పంచాయతీ సర్పంచ్ సంజీవరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం పేదలకోసం వివిధ పథకాల ద్వారా ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. ఆయన శనివారం పంచాయతీ కార్యాలయంలో అవరణలో ఉన్న సచివాలయంలో 104 వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు వివిధ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు బయట మందులు షాపుల కంటే ప్రభుత్వం అందించే మందులు మెరుగైనవని, అవే బాగా పనిచేస్తాయని డబ్బులు ఖర్చు చేసి బయట కొనేబదులు ప్రభుత్వం 104లు ద్వారా అందిస్తున్న మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తమ్మతల్లి ట్రస్టుబోర్డు చైర్మన్ బోయిన మాధవిక్రిష్ణారావు, డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మాధవ్‌ను గెలిపించాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల్లో బిజెపి నాయకులు పి.వి.ఎన్ మాధవ్ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ ఆయన విజయానికి కృషి చేస్తున్నామని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ల కన్నారావు అన్నారు. శనివారం వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో విస్తృత ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సహ కారం తీసుకుంటూ అన్నివర్గాల ప్రజల అభివృద్ధి తోపాటు అన్ని రంగాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పి.వి.ఎన్ మాదవ్‌ను మరొసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర సంపూర్ణ అభివృద్ధి సాధించడానికి బిజెపి ద్వారా మాదవ్ గళం బలంగా పలుకు తుందని అన్నారు. కార్యక్రమంలో వైశ్యరాజు రాజు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర-మందస : మండలంలో కిల్లోయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం మండల విద్యాశాఖాధికారి లక్ష్మణరావు తనిఖీలు నిర్వహించారు. పాఠశాల పని తీరు, విద్యార్థుల విద్యాప్రగతిని పరిశీ లించారు. ఈ నెల 14వ తేదీన నులిపురుగుల నివారణ మంత్రలు ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్య శాఖ సిబ్బంది సూచనలు అమలు చేస్తూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల యాజమాన్యం పూర్తిగా సహకరించాలని సూచిం చారు. మండలంలో 10,323 మంది విద్యా ర్థులకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు.

కొండపోలవలసలో పశువులకు వాక్సినేషన్

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని కొండపోలవలస గ్రామంలో శుక్రవారం 4నెలలు దాటిన దూడలకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు ఎడి ఎ. లోకనాధం, పశు వైద్యాధికారి సంతోష్ కుమార్ తెలిపారు. గ్రామంలో సుమారు 130 టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. 13 పశువులకు టీకా వేయక ముందు రక్త నమూనా సేకరించి టీకా వేసిన తర్వాత మళ్లీ అదే పశువుకు 21 రోజులు తర్వాత మరలా రక్తనమూనా సేకరించి టీకా ప్రభావితం ఎంతవరకు వుందో తెలుసుకోవడం జరుగుతుందన్నారు.

టాప్ గేర్లో సాగిన కిల్లి సత్తన్న ప్రచార జోరు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలో ఎంపీపీ ప్రతినిధి కిల్లి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రచారం జోరుగా సాగింది. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ సీతాం రాజు సుధాకర ని మొదటి ప్రాధాన్యత వోట్ వేసి గెలిపించమని కోరారు. ఈకార్యక్రమంలో వైసీపీ పార్టీ మండల అధ్యక్షలు బెవర మల్లేష్, కోపరేటివ్ ఛైర్మెన్ కోయలపు శేఖర్, మండల నాయుకులు బొడ్డేపెల్లి హరిబాబు మూడడ్ల రమణ, కృష్ణ మరియు తదితర నాయుకులు కార్యకర్తలు పాల్గున్నారు.

ఎఎంసికి పాలకమండలి నామినేట్ ఎప్పుడో?

మరోసారి మాధవికి దక్కేనా...?

విశాలాంధ్ర-కొత్తూరు : కొత్తూరు మండల పరిధిలోకొచ్చే హిరమండలం వ్యవసాయ మెసర్కెట్ కమిటీ కి పాలకమండలి ని ప్రభుత్వం నియమించె ది ఎప్పుడని అధికార వైసీపీ నాయకులు జోరుగా చేర్చిహించు కంటున్నారు గడిచిన రెండేళ్లుగా ఈ ఎఎంసి ఛైర్మన్ గా కొత్తూరు కు చెందిన గోగుల మాధవి కొనసాగారు, ఈ .యడాది జనవసరీ 3 తేదీతో మాధవి ఛైర్మన్ గా నున్న పాలక మండలి పదవి కాలం ముగిసింది, ఎంఎసి పాలక మండలి ని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది, ఈ నియామకానికి స్థానిక ఎమ్మెల్యే టెడ్డి శాంతి సిఫార్స్ చేయాలి, అయితే గోగుల మాధవి ని మరోసారి నామినేట్ చెయ్యడానికి ఎమ్మెల్యే శాంతి సుముఖంగా లేరని తెలుస్తుంది రెండేళ్ళ పాటు ఎఎంసి చైర్మన్ గా నున్న గోగుల మాధవి దివంగత మాజీ ఎంపిపి గోగుల చెల్లమ్ నాయుడు కి కోడలు ఇమే భర్త గోగుల వర ప్రసాద్ నాయుడు కూడా కొత్తూరు వైసీపీ లో కీలక నాయకుడు, కొత్తూరు వైసీపీ లో రెండు వర్గాలు ఉండగా ఆయాన ఎమ్మెల్యే శాంతి వర్గీయు లే, కాగా ఇటీవల వరప్రసాద్ నాయుడు ను ఎమ్మెల్యే శాంతి విస్మరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, హిరమండలం ఎఎంసి కి ఛైర్మన్ తో పాటు పాలక మండలి లేకపోవడంతో కొన్ని విధమైన నిర్ణయాలు తీసుకోలేక సంబంధిత అధికారులు పాలనాపరమైన సమస్యలు తో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రెడ్డి శాంతి హిరమండల ఎఎంసి కి చైర్మన్ తో పాటు పాలక మండలి ని నియమించాలి అని పలువురు కోరుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు సిద్ధం కండి

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఈనెల 16 న స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌ను పగడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరెట్ సమావేశ మందిరంలో ఈ నెల 13 న జరగనున్న స్థానిక సంస్థల పోలింగ్ సంబందించి, ఈనెల 16న శ్రీకాకుళం స్థానిక పాలటెక్నిక్ కాలేజ్ లో కౌంటింగ్ నిర్వహణ లో భాగంగా కౌంటింగ్ పర్సనల్స్ కు మొదటిసారి శిక్షణా తరగతులు నిర్వహించి కౌంటింగ్ నిర్వహణపై సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 16న పాలటెక్నిక్ కాలేజ్ లోఎన్నికల కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కౌంటింగ్ నిర్వహణకు విధులు కేటాయించిన కౌంటింగ్ పర్సనల్స్ నిష్పక్ష పాతంగా కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం వారి ఎన్నికల నియమావళి పై రూపొందించిన మాన్యువల్ పై పూర్తి అవగాహనను ఏర్పరచుకొని పగడ్బందీగా ఎన్నికల కౌంటింగ్ జరపాలన్నారు. మాస్టర్ ట్రెని సుధా సాగర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కేటాయించిన కౌంటింగ్ పర్సనల్స్ కౌంటింగ్ మాన్యువల్ లోని ప్రతి అంశం పై అవగాహన అవసరమని తెలుపుతూ సందేహాలను నివృత్తి చేశారు.శిక్షణ తరగతుల అనంతరం ప్రాక్టికల్ గా డమ్మీ కౌంటింగ్ ప్రక్రియను కౌంటింగ్ పర్సనల్స్ చే చేయించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ తరగతులలో డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. విద్యాసాగర్, కొవ్వాడ ఎస్.డి.సి మురళీ కృష్ణ కౌంటింగ్ పర్సనల్స్, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఒరియా సాహిత్యం మెళకువలపై వర్క్‌షాప్

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఒరియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి అధ్యక్షతన ప్రథమ భాష ఒరియా సాహిత్యం, బోధనలో మెలకువలపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రధానోపాధ్యాయులు అకల రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడియా భాష సాహిత్యం సంస్కృతుల గొప్పతనం గూర్చి కొనియాడారు. ప్రాచీన ఒరియా భాష దినోత్సవం సందర్భంగా ఉత్కళమణి గోపబంధు దాస్ చిత్రపటానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ వర్క్షాపులో జిల్లాలోపని చేస్తున్న 55 మంది ఒరియా భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి ఒడియా డిఐ మాట్లాడుతూ ఒడియా భాష సాహిత్యం శిక్ష దానంలో ఎదుర్కొంటున్న సమస్యలు, పదో తరగతి పరీక్ష ప్రశ్నపత్రంలో వచ్చి మార్పులు మరియు పిల్లలు ఎక్కువ మార్కులు సాధించడానికి అవసరమైన తర్ఫీదుల గురించి చెప్పారు. అలాగే ఈ అవకాశం కల్పించిన జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి, ఒడియా భాష సాహిత్య చరిత్ర గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒడియా భాష ఉన్నతికి ప్రభుత్వ పాఠశాలలో ఒడియా పిల్లల రోల్ పెంచడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పిగా రామహరి పాడి వ్యవహరించారు. ఒడియా లెసన్‌ప్లాన్, ఇయర్‌ప్లాన్, బ్లూప్రింట్, ప్రశ్నాపత్రం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఒడియా ఉపాధ్యాయులు ఒడియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరిని సత్కరించారు.

13 న ఎన్నికలకు సిద్ధం : జేసీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 13న స్థానిక సంస్థల పోలింగు జరగనున్నట్లు సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. ఉదయం 08.00గం.ల నుండి సాయంత్రం 04.00గం.ల వరకు పోలింగు జరుగుతుందని, ఇందుకు సర్వం సిద్ధం చేసినట్లు జెసి తెలిపారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ప్రకటించారు. 13న పోలింగు, 16న కౌంటింగ్ ఉంటుందని, స్థానిక సంస్థల ఓటర్లు జిల్లాలో 776 మంది మాత్రమే ఉన్నందున అదే రోజు కౌంటింగ్ పూర్తవుతుందని జెసి స్పష్టం చేశారు. పోలింగు కోసం జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. శ్రీకాకుళం ఆర్.డి.ఓ ఆఫీస్, పాలకొండ ఆర్.డి.ఓ ఆఫీస్ మీటింగ్ హాల్, టెక్కలి ఆర్.డి.ఓ ఆఫీస్ ఏ.ఓ రూమ్, పలాస తహశీల్దార్ ఆఫీస్ మీటింగ్ హాల్ నందు పోలింగ్ జరుగుతుందని ఆయన వివరించారు. శ్రీకాకుళం డివిజనులో 249 ఓట్లు, పాలకొండలో 153, టెక్కలిలో 162 , పలాసలో 212 ఓటర్లు ఉన్నారని జెసి తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి 1,000 బ్యాలెట్ పేపర్లు వచ్చాయని, అందులో 81 బ్యాలెట్ పేపర్లు రద్దు కాగా, మిగిలిన వాటిని అన్ని పోలింగ్ కేంద్రాలకు సమానంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ 118 బ్యాలెట్ పేపర్లు రిజర్వులో ఉన్నాయని, వాటిని జోనల్ అధికారుల అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరాలను బట్టి వాటిని జోనల్ అధికారులు అందిస్తారని వివరించారు. కావున బ్యాలెట్ పేపర్ల సమస్య లేదని, అలాగే బ్యాలెట్ బాక్సులను 12న పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వీటితో పాటు పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మెటీరియల్, మౌలిక వసతులు సర్వం సిద్ధం చేశామన్నారు. పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి కేంద్రంలో వెబ్ కెమెరాలు, మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల పరిశీలకులు ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలీస్ ఫోర్స్, ఎం.సి.సి టీమ్స్,జోనల్, సెక్టోరియల్ ఆఫీసర్లు తదితరులందరూ అన్ని రకాల శిక్షణ పొంది పోలింగ్ మరియు కౌంటింగ్ కు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

జీడి తోటల్లో అగ్ని ప్రమాదం

- అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రమైన కవిటి పాల బంధ చెరువు సమీపంలో గల జీడి తోటల్లో అగ్నిప్రమాదం జరిగి సుమారు 15 ఎకరాలు జీడి తోట అగ్ని ప్రమాదానికి గురి అయినట్లు స్థానికులు తెలిపారు.సాయంత్రం వేళల్లో కొబ్బరి తోటల్లో చెత్త చెదారం పోగుచేసి నిప్పంటిస్తుంటారు.ఈ నేపథ్యంలో అగ్ని వ్యాపించి ముళ్లపొదలకు,రెల్లిపొదలకు వ్యాపించి జీడి తోటల వరకు విస్తరించి ఉండవచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.సోంపేట అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై మంటలు నివారిస్తున్నారు.అగ్ని ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : శాసన మండలి పట్టబద్రుల నియోజకవర్గానికి సంబంధించి జరగబోయే ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం తహశిల్దార్ ఎస్.గురుప్రసాద్, ఉప తహశిల్దార్ శ్రీహరి బాబులు వి.ఆర్.ఓ చూడామణి తదితరులతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా, విద్యుత్ సరఫరా, నీటి సదుపాయం ప్రధానంగా ఉండేలా చూడాలని స్థానిక సిబ్బందిని సూచించారు. వరుస క్రమంలో ఓటర్లను అనుమతించడం జరుగుతుందని, ఇబ్బందులు తలెత్తితే తక్షణం తమ దృష్టికి తేవాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంజీఆర్

విశాలాంధ్ర-పాతపట్నం: ఈ నెల 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం లోని 5 మండలాల్లో జోరుగా ప్రచారం సాగుస్తున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు పట్టభద్రులందరూ ముక్త కంఠంతో టీడీపీ బలపరిచిన అభ్యర్థి వేపాడ చిరంజీవి రావుని, గెలిపిస్తాం అనడం మార్పుకు సంకేతం అన్నారు. అలాగే ప్రభుత్వంపై వ్యతిరేఖతే టీడీపీ అభ్యర్థి గెలుపునకు కారణం అవుతుందని అన్నారు. ఈ గెలుపు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయ కేతనం కు నాంది అని తెలిపారు. ప్రచారంలో ఆయనతో పాటు 5 మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ఎంజీఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులు 10 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు పాత్ర కీలకం

విశాలాంధ్ర-హిరమండలం : రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 10/10 ఉత్తీర్ణతకు వారి తల్లితండ్రులు పాత్ర కీలకమని, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో జి పగడాలమ్మ సూచించారు. హిరమండలం కస్తూర్బా పాఠశాలను శనివారంఉదయం డి ఈ ఓ పగడాల మ్మ సందర్శించారని ఎస్ ఓ కృష్ణవేణి తెలిపారు. టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులతో కేజీబీవీ పాఠశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని, పరీక్షలు దగ్గర పడుతున్న సందర్భంగా ప్రత్యేకంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకొని ఇంటి వద్ద కూడా చదివించాలని కోరారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి , వారి విద్యా ప్రమాణ స్థాయిని తెలుసుకున్నారు. పదోతరగతి పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పదో తరగతి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు తెలియజేశారు.ఎంఈవో కె రాంబాబు, కస్తూర్బా పాఠశాల ఎస్ఓ సంపతిరావు కృష్ణవేణీ, ఉపాధ్యాయుని లు పాల్గొన్నారు.

ఘన జీవమృతం తయారీ విధానంపై అవగాహన

విశాలాంధ్ర-కవిటి : ఘన జీవమృతం తయారీ విధానం పై అవగాహన కార్యక్రమం మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ మేరకు శనివారం మండలం లోని ఖజుర్ గ్రామంలో సామూహికంగా మహిళ సంఘాలతో వెయ్యి కేజీలు ఖరీఫ్ కు దుక్కి లో వేసుకోవడం కోసం ఘన జీవామృతం తయారు చేసే విధానం రైతులకు వివరించారు.ఘన జీవామృతం తయారీకి ఆవు పేడ వెయ్యి కిలోలు,ఆవు మూత్రం 100 లీటర్లు,నల్ల బెల్లం కిలో,సెనగపిండి లేదా పప్పు దినుసుల పిండి, గుప్పెడు పొలం గట్టు చివరి మట్టి లేదా అడవి మట్టి,అన్ని పదార్థాలని కొద్ది కొద్దిగా ఆవు మూత్రాన్ని చల్లుతూ కలపాలి.ఈ మిశ్రమాన్ని ముద్దలుగా తయారు చేయాలి.ఇలా చేస్తే ఘన జీవామృతం తయారవుతుందనీ తెలిపారు.ఈ మిశ్రమాన్ని నీడలో పలుచగా పరచి 7 రోజులు ఎండబెట్టాలి. అనంతరం ఎండిన తరువాత పొడిచేసి గోనె సంచిలో నిలువ చేసుకోవచ్చు అన్నారు.6 నెలల వరకూ నిల్వ ఉంటుందనీ వివరించారు.20 కిలోల ఘన జీవామృతం 100 కిలోల మాగిన పశువుల ఎరువు,గెత్తం కలిపి ఆఖరి దుక్కిలో వేసుకోవాలనీ సూచించారు.1,2 నెలల తరువాత పైవిధంగానే ఘన జీవామృతాన్ని కలిపిన పశువుల ఎరువు, గెత్తం సాళ్ళ మధ్యలో వేసుకోవాలని మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ యాంకర్ యశోద, మండల యాంకర్ శివనందం,లోహిదాస్, కుమారి,తులసయ్య, ఐసిఆర్పి స్వాతి, శ్రీదేవి, కామరాజు,గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు చూసి ఓటేయాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పట్టభద్రుల ఓటర్లు అంతా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఓటు వేయాలని కోటబొమ్మాళి మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. ఆయన శనివారం మేజరుపంచాయతీ పరిదిలోగల ఎస్సీకాలనీ, హడ్కోకాలని, విద్యుత్‌నగర్, రెడ్డికవీధి, పెద్ద, చిన్న పొందరవీధులలో ఉన్న పట్టుభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ తరుపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు నాయులు ఇంటికి ఓ ఉద్యోగం అని చెప్పి నిరుద్యోగులను, ఉద్యోగులను మోసం చేశాడని, కానీ ముఖ్యమంత్రి కరోనాతో రాష్ట్రం అతలకుతలంగా ఉన్నా అందని ఆదుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కుప్పిలి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంతల క్రిష్ణారావు, ఇర్రి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అలాగే హరిశ్చంద్రపురం పంచాయతీలలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైయస్ఆర్ సిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతం రాజు సుధాకర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని స్థానిక సర్పంచ్ గురువెల్లి కేశవరావు, స్థానిక ఎంపీటీసీలు పూజారి సత్యం, బగాది దివాకర్, మండల విప్ బొడ్డు అప్పన్న, మండల యూత్ లీడర్ కామి నాయుడు, పెద్ద బమ్మిడి సచివాలయ కన్వీనర్ గుట్ల లక్ష్మణ్, చాప మాధవ్, పట్టభద్రుల ఎమ్మెల్సీ మండల కోఆర్డినేటర్ బమ్మిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారానికి లొంగిపోవద్దు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో జరుగుతున్న శాసన మండలి ఎన్నికల్లో కూడా అధికార పార్టీ తన బలాన్ని ఉపయోగించి ఓట్లను పొందాలని ప్రయత్నాలు చేస్తుందని, అధికారం ఉన్న వాళ్ళకే ఓటేయ్యాలని మభ్య పెడుతున్నారని పట్టబద్ర ఓటర్లు గమనించాలని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సే ఎన్నికల పరిశీలకుడు సత్తిబాబు అన్నారు. శనివారం 6, 10వార్డుల్లో పర్యటించి పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవి తరపున ప్రచారాన్ని సాగించారు. ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు పట్టబద్రులైన ఓటర్లను సైతం అధికార పార్టీ నాయకులు తప్పుద్రోవ పట్టించి ఓట్లకు గాలం వేస్తున్నారని, ఇప్పటి రాష్ట్ర పరిస్థితుల్లో శాసన మండలి తీసుకోవాల్సిన నిర్ణయాలకు అనుగుణంగా ప్రజల గొంతు వినిపించే వారే ఉండాలని అన్నారు. వేపాడ చిరంజీవికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. 3వ వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ళ ధర్మారావు, నందిక జానకిరావు, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ, కార్యనిర్వాహక కార్యదర్శి బత్తిన క్రిష్ణయ్య, పార్టీ బి.సి సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్, శిష్ఠకరణ విభాగం ప్రతినిధి కోటేశ్వర రావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ళ జయదేవ్, ఐ-టిడిపి ప్రతినిధి సాలిన జగదీష్, రెయ్యి జానకిరావు, రంగాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చివరిరోజు ఎన్నికల ప్రచారం ముమ్మరం

విశాలాంధ్ర-పాతపట్నం : వైసీపీ నాయకులు ఎం.ఎల్.సి పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో చివరిరోజు శనివారం ముమ్మరంగా ప్రచారం సాగింది. పాతపట్నం ప్రభుత్వ మోడల్ కళాశాల మరియు బ్రిడ్జి స్కూల్లో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన.ప్రదీప్ అధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం నడుస్తున్న సందర్భంలో రానున్న కాలంలో విశాఖపట్నం పరిపాలన రాజధాని రారున్న సందర్భంగా ఏంఎల్సిసి.సేవలు మనకు ఎంతో అవసరమని అన్నారు.అందుకుగాను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బలపర్చిన వైసీపీ ఏం.ఎల్.సి అభ్యర్థి సీటంరజు సుధాకర్ ను మొదటి ప్రాధాన్యత ఓట వేసి గెలిపించి పాతపట్నం శాసనసభ్యులు రెడ్డి శాంతికి మంచి పేరు తేవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ చైర్మన్ పాత్ర కండి.ధనుంజయ,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గొకవలస. రాము, సచివాలయం కన్వీనర్ సంఘ అధ్యక్షుడు ఏనుగుతల సూర్యం, కోదూరు సర్పంచ్ పనుకు మోహనరావు, తుర్పుకాపు రాష్ట్ర సంఘం నాయకుడు టంకాల సుధాకర్, పెద్దింటి. తిరపతిరావు, నీలమణి దుర్గ అలయకమిటీ సభ్యులు వడ్డ.నేతాజీ, సవిరిగాన కృష్ణారావు, మజ్జి వరదరాజుతోపాటు ప్రదీప్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

చైల్డ్ మ్యారేజ్‌స్‌పై మీ గ్రామాలలో అవగాహనా కల్పించండి

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలంలోని ప్రముఖ విద్యాసంస్థ వెంకటసాయి కళాశాలలో ఛైర్మెన్ జగన్నాథ రావు ఆధ్వర్యంలో ఘనంగా ఫేర్వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సరుబుజ్జిలి ఎస్.ఐ కూటికుప్పల కృష్ణ ప్రసాద్ హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాద్యాయులు చెప్పే విషయాలు నిచితంగా గమినించి వీలైనంత వరకు ఆచరణలో పెట్టాలని, పట్టణాలలో పిల్లలు మారక ద్రవ్యాలకు బానిసలు కారాదని, ముక్యంగా గ్రామాలలో ఎక్కడైనా చైల్డ్ మ్యారేజ్ స్ కు ఎవరైనా ప్రోత్సహిస్తే మాకు వివరాలు తెలియచేయాలని అన్నారు. విద్యార్థులు ఉత్సహంగా కార్యక్రంలో పాల్గున్నారు. ప్రత్యేక అతిధులుగా పంచాయతీ సెకెరటోరి అనిల్ కుమార్ మరియు ఏ.ఎం.సి ఛైర్మెన్ భాస్కర్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పురుషోత్తం రావు, ఏ.ఓ.సీతారాం, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనను అంతమొందించండి

- వైసీపీది వ్యాపారమే
- టిడిపి జిల్లా అధ్యక్షులు "కూన"

విశాలాంధ్ర-ఆముదాలవలస : ప్రస్తుత వైసిపి అవినీతి పాలనను అంతమొందించేందుకు పట్టభద్రులు మేధావులు ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా శ్రీకారం చుట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ విప్ కూన రవికుమార్ అన్నారు. శనివారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు, యువతకు, రైతులకు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు, చివరకు అన్ని వర్గాల వారిని అట్టడుగునకు దిగజార్చిన జగన్మోహన్ రెడ్డి పరిపాలనను అంతమందించాల్సిన పరిస్థితులు ఆంధ్రప్రదేశ్లో ఏర్పడ్డాయి అన్నారు. రాష్ట్రంలోని సహజ వనరులతో ప్రభుత్వం వ్యాపారం చేస్తూ అభివృద్ధిని విస్మరించిందని తెలియజేశారు. నాలుగు ఏళ్ళు గడుస్తున్న కనీసం ఏ ఒక్క వర్గానికి కూడా న్యాయం చేయలేదని జగన్ మోసపు రెడ్డిగా అభివర్ణించారు. ఎన్నికల ముందు వాగ్దానాలు అందించి గద్దెనెక్కిన తర్వాత అరాచక పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని వాగ్దానమిచ్చిన వైసిపి నాయకులు ఇప్పుడు తోక ముడుచుకుని ఇంట్లో కూర్చున్నారని స్థానిక ప్రజాప్రతిని ఉద్దేశించి అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి మాట, ఆముదాలవలసలో తమ్మినేని మాటలకు విలువ లేదని ఇవి చల్లని వెయ్యి రూపాయలు కాగితాలని ఎద్దేవా చేశారు.

వైసీపీ ది వ్యాపారమే.... వైసీపీ ప్రభుత్వం ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ ఆంధ్రప్రదేశ్లో పరిపాలన సాగించకుండా రాష్ట్రాన్ని దోచుకునేందుకు వ్యాపారం చేస్తుందని విమర్శించారు. ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టేందుకు మూడు రాజధానుల పేరు చెప్పి, విశాఖను రాజధాని చేస్తామని ప్రచారం చేసిన వైసిపి ఉత్తరాంధ్ర అభివృద్ధి చేస్తామని, స్థానికేతర అభ్యర్థిని ఎమ్మెల్సీ స్థానానికి నిలబెట్టినప్పుడే వారి విశ్వేశ్వరునియత ప్రజలకు అర్థం అయిందని తెలిపారు. చంద్రబాబు కన్నా మిన్నగా పరిపాలన అందిస్తామని ప్రగల్బాలు పలికిన జగన్ మోసపు రెడ్డి రాష్ట్రాన్ని అట్టడుగునా పడేశారని అన్నారు. కనీస మౌలిక వసతులు కల్పనలో రాష్ట్రం 30 ఏళ్ళు వెనుకబడి ఉందని అన్నారు. సహజ వనరులను దోచుకుంటూ తన అవనియాయులకు కట్టబెడుతున్నారని ప్రజలకు అందించవలసిన వాటితో వారి వ్యాపారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. అబద్ధపు ప్రచారాలు చేసి అమలు కానీ వాగ్దానాలతో ప్రజలను నమ్మబలికి ఇప్పుడు నట్టేట ముంచారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా మేధావులు, రాజకీయ విజ్ఞులు, రైతులు, ముఖ్యంగా యువత మేల్కొని జగన్ చేస్తున్న మోసాలను అంతమొందించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు వేదిక కావాలని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసిన చంద్రబాబు నాయుడు బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిస్వార్థ పరుడైన వేపాడ చిరంజీవిరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి పాలకులకు బుద్ధి చెప్పాలని కోరారు. ఆయనతోపాటు సర్పంచులు రమణమూర్తి తదితరులు ఉన్నారు.

ధర ఘాటు.. మిర్చికి లేదు చోటు

- జిల్లాలో గణనీయంగా తగ్గిన మిర్చి సాగు
- నాడు వేల ఎకరాల్లో... నేడు వందల్లోనే ...
- ఇలా అయితే కనుమరుగయ్యే జాబితాలో మిర్చి పంట
- ప్రకృతి సహకరించకపోవడమే ప్రధాన కారణం
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ఆసక్తి

గుంటూరు తరువాత మిర్చి సాగుకు శ్రీకాకుళం జిల్లా పెట్టింది పేరు. జనవరి నాటికి మిర్చి ఉత్పత్తుల్లో యార్డులు కలకలలాడుతూ కనిపించేవి. రైతులకు కూడా గిట్టుబాటు అయ్యేది. కానీ ఇదంతా గతం. జిల్లాలో మిర్చి సాగు ఘనంగా తగ్గుముఖం పట్టింది. పెట్టుబడులు, శ్రమ పెరగడం, పంట గిట్టుబాటు కలగకపోవడం వంటి కారణాలతో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. ప్రస్తుతం ధర ఉన్నా.. ఉత్పత్తులు లేక జిల్లా అవసరాల కోసం దిగుమతులు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

విశాలాంధ్ర-ఎచ్చర్ల : జిల్లాలో మిర్చి సాగు గణనీయంగా తగుముఖం పట్టింది. వేల ఎకరాల్లో సాగు అయ్యేది ఢిల్లీ, కాన్పూర్ తదితర ప్రాంతాలకు ఇక్కడ మిర్చి ఎగుమతి అయ్యేది. అయితే వేల ఎకరాల సాగు విస్తీర్ణం వందల్లోకి పడిపోయింది. ఖరీఫ్ లో కేవలం 300 ఎకరాల్లో రబి లో 1500 ఎకరాల్లో మిర్చి సాగు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మిగిలిన పంటలతో పోలిస్తే మిర్చి సాగులో శ్రమ, పెట్టుబడి ఎక్కువ. దీనికి తోడు చాలా జాగ్రత్తగా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే చివరకు వాతావరణం కలిసి వస్తేనే పంట పండేది, లేకుంటే అపార నష్టం తప్పదు. అందుకే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. మొక్కజొన్న, కూరగాయలు వంటివి సాగు చేస్తున్నారు. అయితే ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం మిర్చి కనుమరుగయ్యే పంటల జాబితాలో చేరిపోవడం ఖాయం. ప్రస్తుతం కూరాకుల కిలో ధర రూ 300 పైగానే పలుకుతోంది సాధారణంగా మిర్చి దిగుబడి జనవరి నెలలో రావాల్సి ఉంది ఈ ఏడాదిలో ఫిబ్రవరి నెల గడుస్తున్నా ...ఇప్పటికీ మిర్చి దిగుబడి అంతంత మాత్రమే ఉంది. విపరీతమైన మంచు ప్రభావం ఎర్ర తెగులు కారణంగా దిగుబడి తగ్గడమే కాకుండా ఆలస్యంగా పంట చేతికి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబరు నెలలో అకాల వర్షాల కారణంగా మిర్చి సాగులో జాప్యం జరిగింది. దాని ప్రభావం ఇప్పుడు ఉత్పత్తులపై పడుతోంది.

ఇది పరిస్థితి : జిల్లాలో రణస్థలం, పైడి భీమవరం, లావేరు, వెంకటాపురం తదితర ప్రాంతాల్లో కూరాకుల మిర్చి, గార, లబ్బోడిపేట, ఇప్పిలి, కొయ్యన్నపేట, పోలాకి, వెదుళ్ళ వలస, డోల, లంకపేట, సుగ్గ అగ్రహారం, సాలి హుండం, కళింగపట్నం ప్రాంతాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. నరసన్నపేట ప్రాంతంలో పచ్చిమిర్చి సాగునకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ నుంచి పచ్చిమిర్చి విశాఖపట్నం, అనకాపల్లి, రాజమండ్రి తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. లావేరు, రణస్థలం మండలాల్లో 200 ఎకరాల్లో మిర్చి పంట కు బదులు పుచ్చకాయ సాగు చేస్తున్నారు.

ధర పెరిగేనా...? ఈ ఏడాది కూరాకుల మిర్చి ధర రూ 300 పైగానే పలుకుతోంది. గత ఏడాది రూ 180 ఉండగా రూ 120 అదనంగా పలుకుతోంది. ఈ ఏడాది ధర ఆశాజనకంగా ఉన్నా... దిగుబడి లేదని రైతులు వాపోతున్నారు. క్రిమి సంహారక మందులు, పురుగుల మందులు వినియోగంతో మిర్చి పంట నాణ్యత బాగా తగ్గుతోంది. ఈ కారణంగా కోల్డ్ స్టోరేజీలో నిల్వకు పనికిరాకుండా ఉంది. నిల్వ ఉంచితే మిర్చి రంగు మారిపోతుంది. దీనివల్ల ఈ ప్రాంతంలో నిల్వ చేసేందుకు ట్రేడర్లు కూడా ఇబ్బంది పడుతున్నారు.

జిల్లాలో చిలకపాలెం, పొందూరులో మిర్చి కొనుగోలు కేంద్రాలు ఒకప్పుడు ఈ సీజన్లో కలకలలాడుతుండేవి. చిలకపాలెంలో 4 పొందూరులో 8 కేంద్రాల ద్వారా మిర్చి కొనుగోలు జరిగేది. మిర్చి దిగుబడి విపరీతంగా తగ్గడం, ఎగుమతికి అవకాశం లేకపోవడంతో కొనుగోలు కేంద్రాలు వెలవెల బోతున్నాయి.

ఖర్చు అధికం కునేళ్లుగా మిర్చి సాగు చేస్తున్నాం చాలా ఖర్చుతో **కూడుకున్న పని :** అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా ఈ ఏడాది ఇప్పటికీ పంట చేతికి రాలేదు. ఎకరా పొలంలో మిర్చి సాగునకు వేలాది రూపాయలు ఖర్చు చేసినా.. పంట వస్తుందా? లేదా? కూడా తెలియని పరిస్థితి మిర్చి సాగు విస్తీర్ణం తగ్గడానికి ఇది ఒక కారణం.

- తంగి మల్లేశ్వర రావు, రైతు తంగివానిపేట.

తగ్గిన సాగు : చిలకపాలెం కేంద్రంగా నాలుగు దశాబ్దాలుగా మిర్చి వ్యాపారాన్ని చేస్తున్నాం. ఒకప్పుడు ఇక్కడి నుంచి ఢిల్లీ, కాన్పూర్ తదితర ప్రాంతాలకు మిర్చి ఎగుమతి అయ్యేది. పదేళ్లుగా మిర్చి సాగు బాగా తగ్గింది. ఈ ఏడాది మరింత తగ్గు ముఖం పట్టింది.

- అట్ల శేషగిరిరావు ట్రేడర్, చిలకపాలెం.